# మా 'సుధ' స్మృతిలో......



మనిషి ఆయువు నూరేళ్ళని ఒక నమ్మకం.
అందుకే "శతమానం భవతి, ఆయుష్మాన్ భవ,
దీర్ఘాయురస్తు" అని దీవిస్తారు పిన్నలను-
పెద్దలు, బ్రాహ్మణోత్తములు
కాని 'ఆ' ఆశీర్వచనంలో ఎంత నిజముందో
కాలమే చెబుతుందని కూడా అనుకుంటాము.
అమ్మా! సుధా! తీరని వ్యధ మాకు మిగిల్చి
అర్ధాయుస్సుతో - నీవు మానుండి దూరమయ్యాక గానీ,
మాకు తెలిసిరాలేదు - ఆ 'దీవనలు'
అప్పుడప్పుడు అబద్ధాలవుతాయని!

పెరిగి, పెద్దయై, విద్యాబుద్ధులు నేర్చి,
జ్ఞాన-విజ్ఞాన ప్రసూనాల ఆస్వాదించి,
"మానవ సేవయే మాధవ సేవ"యని తలంచి,
"ఆర్తుల సేవ"యే నిరంతర చింతనగా ఎంచితివి...

నీ అమృత వాక్కులతో బంధువులందరి
"తలలో నాలుక'లా మెదిలావు.
"ఆస్ట్రేలియా"లో నీ తోటి స్నేహితులందరిని
ఆకట్టుకొని, వారి ఆదరాభిమానాన్ని,
వారి అపార సానుభూతిని పొందావు.
మానవీయ విలువలతో
అనారోగ్య బాధితులైన వారి పిల్లలకు సేవలందించి,
మృత్యుముఖము నుండి కాపాడిన మనీషివీవు.
అలాంటి నిన్ను మా నుండి విడదీయుటకు
'విధి'కి నీ పై 'దయ' మృగ్యమయ్యెనా ఏమి?
ఆ దైవాన్ని మెప్పించలేకపోయావా? తల్లీ!

చిన్ననాటి నీ 'మంకు-మారాము' చేష్టలు
ఇంకా మా మదిలో మెదులుతూనే వున్నాయమ్మా.
మా కంటి పాపవై, మా ఇంటి వెలుగువై,
మా లాలన-పాలనలో పెరిగిన నీవు
మా మురిపాల ముద్దుబిడ్డవై మెదిలావు.
అలుపు - సొలుపుని అధిగమించి,



'ఐదుపదుల' నీ జీవన గమనంలో
మమ్ముల్నందరినీ ఆదరించి, అలరించి,
తుదకు 'కడు'వేదన పాలు చేసి,
మమ్ముల శోక సంద్రంలో ముంచి,
నీవు ఈ లోకాన్ని విడిచి
తిరిగిరాని "పై" లోకానికి తరలి వెళ్ళావు.
ఇది నీకు తగునా తల్లీ!

విశేష విజ్ఞానవంతుడై, అభ్యుదయ భావాలతో
లోతైన లక్ష్యశుద్ధి కలిగి, ఆ లక్ష్యసిద్ధి పొంది,
తన లోకజ్ఞతతో 'ఆస్ట్రేలియా'లో
అందరి మన్ననలు అందుకొని,
తన ప్రజ్ఞతో తాను పని చేస్తున్న
"ఇన్సిటెక్ పివొట్" ఫెర్టిలైజర్ కంపెనీకి
అంతర్జాతీయ స్థాయిలో "ఉజ్వల వన్నె" తెచ్చిన
ప్రతిభావంతుడైన మా అల్లుడు
పట్టాబత్తుల వెంకటయ్యకు ఇల్లాలివై విలసిల్లావు
ఇద్దరు బిడ్డల తల్లిగా 'మాతృత్వాన్ని"
సార్థకం చేసుకొన్నావు

సృజనాత్మకమైన మీ ఇరువురి ఊహలకు
ప్రతీకగా మీ కూతురికి "సృజన" యని
నిత్య చైతన్య శీలురైన మీరు,
మీ వంశోద్ధారునికి "కృష్ణ చైతన్య"యని
నామకరణం చేసి కృతార్థులైనారు
ఎంతో వైభవోపేతంగా కూతురు 'కళ్యాణం'
కావించి చరితార్థులైనారు

అమ్మా! సుధా! నీవు మా ముందులేకపోయినా
నీ మధుర జ్ఞాపకాలు, నీ తీపి మాటలు, నీ నగుమోము
నిత్యము మమ్ముల 'కలవర' పెడ్తున్నాయమ్మా
మాకు కల్గిన ఈ "కడుపు కోత" దుఃఖభారం
ఎవరు తీర్చగలరు? మేము ఎలా భరించగలము తల్లీ!
కడుపు తీపితో నిన్ను "తలచుకొన్న" కొలది
మా మనస్సుల "తొలిచేస్తు"న్నాయమ్మా-నీ జాలిచూపులు



అపురూపమైన "నీ రూపం" క్షణం క్షణం
మా ముంగిట్లో, మా కళ్ళముందే
కదలాడుతూనే వున్నది తల్లీ !

నీ పాదాల అలికిడి, నీ మాటల సవ్వడి కోసం
మా "నిర్జీవ తనువులు" తహతహలాడుతూ
నీవు లేని "లోటు"ను తట్టుకోలేక పోతున్నాయి.
నీ "యెడబాటు" దహించి వేస్తున్నదమ్మా మా హృదయాలను
నింగికెగిసిన నిండైన నీ రూపం జ్ఞప్తికి రాగా
మా గుండెల్ని పిండేస్తున్నదమ్మా

నీ లాంటి అకాల మరణం ఏ బిడ్డకు రాకూడదు
ఇలాంటి దుస్థితి ఏ తల్లిదండ్రులకు కలుగకూడదమ్మా!
మమ్ముల 'ఓదార్చ' మరోజన్మ ఎత్తలేవా తల్లీ!
ఈ మమకార మమతానుబంధాలు
ఎన్నటికీ వీడిపోనివి కదమ్మా!

ఓ బంగారు తల్లీ! మా పై దయరాదా!
కలలోనైన ఒక్కసారి కనిపించి పోవా!
నవ్వులు చిందే నీ 'ఫోటో' చూడ
నిన్ను మరువలేకున్నామమ్మా.
నీవు లేని నిజం నమ్మశక్యం కాకున్నది తల్లీ!
ఇక - ఎటూ నీవు రాలేవు కదా!
నీ ఆత్మకు శాంతి నివ్వాలని,
ఆ దైవాన్ని, అర్థిస్తున్నాం, ప్రార్థిస్తున్నాం
ఓం శాంతిః శాంతిః శాంతిః

*రచన:*
*"నీవు లేని నీ పేద" పెదనాన్న*
*వనం శంకరయ్య, హైద్రాబాద్.*
*సెల్: **939 303 9795***